క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

శాస్త్రోక్తంగా ధనుర్మాస పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామివారి ఆలయంలో పుష్పాలు, ప్రమిదలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం శుక్రవారం జరుగుతుందని ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి లెక్కింపు జరుగుతుందన్నారు. భక్తులు హాజరు కావాలని కోరారు.

వారంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో దరఖాస్తు చేసుకున్న రైతులకు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను వారంలోపు ఏర్పాటు చేస్తున్నామని ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లతో గురువారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. విద్యుత్ బిల్లింగ్ ప్రక్రియను ప్రతి నెలా ఏడులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. జియో ట్యాగింగ్ సిస్టమ్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్‌ను క్రమం తప్పకుండా చేపట్టాలని చెప్పారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సంబంధించిన రైతుల ఆధార్, మొబైల్ నంబర్లను లింక్ చేయాలని కోరారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, అసిస్టెంట్ ఇంజినీర్ కల్పన, అనిల్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులపై దాడి

నెల్లూరు రూరల్: వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు, సిబ్బందిపై కొందరు దాడికి పాల్పడిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. విద్యార్థులపై రౌడీషీటర్లు దాడికి పాల్పడగా, సిబ్బంది అడ్డొచ్చారు. దీంతో వీరిపై సైతం దాడికి పాల్పడ్డారు. కాగా ఈ విషయమై ప్రిన్సిపల్‌ను సంప్రదించగా, దాడి జరిగిన మాట వాస్తవమేనని చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

బేటీ బచావో.. బేటీ పఢావోపై శిక్షణ

నెల్లూరు (వేదాయపాళెం): మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బేటీ బచావో... బేటీ పఢావోపై ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు శిక్షణ కార్యక్రమాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మాట్లాడారు. బేటీ బచావో... బేటీ పఢావో కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు కృషి చేయాలని సూచించారు. అనంతరం డైరీని ఆవిష్కరించారు. రిసోర్స్ పర్సన్ రమేష్, నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ‘ఆడుదాం ఆంధ్రా’

పొదలకూరు : మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరుగుతున్నాయి. ప్రతి గ్రామ సచివాలయ స్థాయిలో విజయం సాధించిన వారు రెండోరోజు గురువారం పొదలకూరు డీఎన్నార్ జెడ్పీహైస్కూల్, మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీహైస్కూల్ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. ఎంఈఓ శోభనాద్రి టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత కృష్ణపట్నం

ముత్తుకూరు : ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీల్లో భాగంగా ముత్తుకూరులోని మూడు మైదానాల్లో 16 సచివాలయాలకు సంబంధించి మండల స్థాయి పోటీలు గురువారం జరిగాయి. ఇందులో భాగంగా ఫిషరీస్ కాలేజీలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్‌లో కృష్ణపట్నం సచివాలయం జట్టు విజయం సాధించి, నియోజకవర్గ పోటీలకు అర్హత సాధించింది. జెడ్పీ హైస్కూల్‌లో కబడ్డీ పోటీలు జరిగాయి. అయితే, లైటింగ్ తగ్గిపోవడంతో పోటీలను శుక్రవారానికి వాయిదా వేశారు. ఎస్–2 ఆడిటోరియంలో సాయంత్రం షటిల్ పోటీలు ప్రారంభించారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఇందుకూరుపేట : క్రీడల ద్వారా మానసికోల్లాసంతో పాటు గెలుపు ఓటములను ఎదుర్కొనే ధైర్యం లభిస్తుందని డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పల్లిపాడులో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు తగిన ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు.



కొడవలూరు: హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నేత కైలాసం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

కొడవలూరు: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా నార్సురాజుపాళెం జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి బాలుర కబడ్డీ పోటీలు గురువారం నిర్వహించారు. మొత్తం 16 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. యల్లాయపాళెం సచివాలయ జట్టు విజేతగా నిలిచి నియోజకవర్గ పోటీలకు ఎంపికైంది. తొలుత ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా వల్ల గ్రామాల్లోని క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తోందని తెలిపారు. పీడీలు ఐ.శ్రీధర్‌రెడ్డి, సుబ్బారావు, వెంకటేశ్వర్లు అంపైర్‌లుగా వ్యవహరించారు. పంచాయతీ కార్యదర్శులు జి.జాలయ్య, జి.రాధాకృష్ణ, అంకమరాణి, విజయలక్ష్మి, శీనమ్మ, డి.సురేష్‌కుమార్, ఎం.బ్రహ్మానందరెడ్డి, బి.మధు, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ వి.మనోజ్‌కుమార్‌రెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా..

కోవూరు : మండలంలోని వేగూరులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. మొత్తం 16 సచివాలయాలకు సంబంధించిన జట్లు పోటీలో తలపడ్డాయి. పీడీలు దేవిక, మధుసూదన్‌రావు, రమేష్, పీఈటీలు వెంకటసుబ్బమ్మ తదితరులు పోటీలను పర్యవేక్షించారు. ఎంఈఓ రహీమ్ పాల్గొని, క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



పొదలకూరు : టాస్ వేస్తున్న ఎంఈఓ శోభనాద్రి



ముత్తుకూరు : ఫిషరీస్ కాలేజీలో వాలీబాల్ టోర్నమెంట్



కొడవలూరు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



ఇందుకూరుపేట : క్రీడాకారులతో అధికారులు, నాయకులు



పొదలకూరు : క్రీడాపోటీల విజేతలతో అధికారులు



కోవూరు : వాలీబాల్ క్రీడాకారులతో అధికారులు

ఈనెల 19 నుంచి కులగణన



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు : మండల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఈనెల 19వ తేదీ నుంచి కులగణన చేపడుతున్నట్లు ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనను వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా చేపట్టాల్సి ఉంటుందన్నారు. ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, వివిధ శాఖల ఏఈలు జగదీష్, మాధవయ్య, ఏపీఎం వెంకటస్వామి, ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్, ఎంఈఓలు రహీమ్, చెంచులక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ శివనాయక్

విడవలూరు : మండలంలోని రామతీర్థం, చౌకచర్ల గ్రామాల్లో ఎరువుల దుకాణాలను పొదలకూరు ఏడీఏ శివనాయక్ గురువారం తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి పి.వెంకటకృష్ణయ్య ఉన్నారు.

సీహెచ్‌సీకి వైద్య సామగ్రి వితరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి కోదండరామిరెడ్డి కుటుంబ సభ్యులు వినీతమ్మ, సునీతమ్మ గురువారం వైద్య సామగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ చిన్న పిల్లలకు ఉపయోగపడే సామగ్రిని అందజేసినట్లు తెలియజేశారు. భవిష్యత్‌లో కూడా సీహెచ్‌సీకి అవసరమైన పరికరాలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారిణి పద్మజ, డాక్టర్లు అబ్దుల్ సమద్, ప్రత్యూష, అశ్విని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో అక్షతల శోభాయాత్ర

కోవూరు : మండల పరిధిలోని కొత్తూరులో అయోధ్య అక్షతల శోభాయాత్ర గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత గ్రామంలోని కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో అయోధ్య అక్షతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ గ్రామవీధుల్లో శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు ఇంటింటికీ వెళ్లి అక్షతల ప్యాకెట్‌లను అందజేశారు.



నేత్రపర్వంగా సాగుతున్న శోభాయాత్ర

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

మనుబోలు : సంక్రాంతి సందర్భంగా ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అజయ్‌కుమార్ హెచ్చరించారు. మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో ఆయన గురువారం మాట్లాడారు. సంక్రాంతిని సాంప్రదాయబద్ధంగా కుటుంబాలతో కలిసి ఇళ్లల్లో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై అజయ్‌కుమార్

సర్వేపల్లి సమగ్రాభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని సమగ్రంగా, సంపూర్ణంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రామదాసుకండ్రిగ, నాయుడుపాళెం గ్రామాల్లో రూ.1.30 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, సైడు కాలువలను మంత్రి కాకాణి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించడంతో సర్వేపల్లి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఒక్క రామదాసుకండ్రిగ పంచాయతీలోనే రూ.6.25 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేయించినట్లు వివరించారు. రామదాసుకండ్రిగ రైతులు గత 40 ఏళ్ల నుంచి వర్షం కురిస్తే తప్ప పంటలు పండించుకునే పరిస్థితి లేదన్నారు. కనుపూరు కాలువ నుంచి అటవీ భూముల్లో సొంత నిధులు వెచ్చించి, రామదాసుకండ్రిగ చెరువు వద్దకు కాలువ తవ్వించి సోమశిల జలాలను విడుదల చేయించామన్నారు. కాలువ తవ్వకాల సమయంలో సోమిరెడ్డి అడుగడుగునా అడ్డుకునే కుట్రలు చేసినా, అన్ని ఇబ్బందులు అధిగమించి పూర్తి చేయడంతో రైతులు సంతోషంగా పంటలను పండించుకుంటున్నారని చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 5,445 కుటుంబాలకు 6,610 ఎకరాల భూ పంపిణీ జరిగిందన్నారు. దీనిని కూడా అడ్డుకునేలా సోమిరెడ్డి కుట్రలు పన్నడం సిగ్గు చేటన్నారు. భూ పంపిణీ లబ్ధిదారులు కాకాణి బినామీలంటూ సోమిరెడ్డి చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. ఎంపీడీఓ ముజీబున్నీసా, సర్పంచ్ షేక్.నాజున్నీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ నేతలు షేక్.షాజహాన్, వెంకటసుబ్బయ్య, నరసయ్య, చెంచయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పూర్తయిన సీసీరోడ్లకు సంబంధించి శిలాఫలకాలను ఆవిష్కరించిన మంత్రి కాకాణి

బీజేపీ మండలాధ్యక్షుడిగా సంపత్‌కుమార్‌రెడ్డి

ముత్తుకూరు : బీజేపీ ముత్తుకూరు మండలాధ్యక్షుడిగా మామిడిపూడికి చెందిన వేళపాళెం సంపత్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు చంద్రప్ప గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పిడూరుపాళెంలో ముందస్తు సంక్రాంతి



ఉత్సాహంగా ముగ్గులు వేస్తున్న మహిళలు

మనుబోలు : మండలంలోని పిడూరుపాళెంలో గ్రామస్తులు ముందస్తు సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఉజ్వల పాఠశాల ఆధర్యంలో గ్రామస్తులకు ముగ్గుల పోటీలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొని అందంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. గెలుపొందిన వారికి పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. అనంతరం భోగి వేసి పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత ఏడెం మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపం సంక్రాంతి వేడుకలన్నారు. గ్రామస్తులందరూ తమ కుటుంబాలతో కలిసి సంక్రాంతి వేడుకలను ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.



భోగి మంటలను తిలకిస్తున్న పాఠశాల సిబ్బంది

గ్రామీణ క్రీడాకారులకు వరం

- సర్వాంగ సుందరంగా పొదలకూరు స్టేడియం
- నేడు కాకాణి చేతుల మీదుగా ప్రారంభం

పొదలకూరు : గ్రామీణ క్రీడాకారుల దశాబ్దాల కల నెరవేరింది. పొదలకూరులోని కాకాణి రమణారెడ్డి స్టేడియం భవనానికి మహర్దశ పట్టింది. ఒకటిన్నర దశాబ్దానికిపైగా పెండింగ్‌లో ఉన్న స్టేడియం పనులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పూర్తి చేయించారు. 1999వ సంవత్సరంలో మినీస్టేడియానికి అంకురార్పణ జరిగినా అది ప్రతిపాదనలకు మాత్రమే పరిమితమైంది. అయితే అప్పట్లో స్టేడియం నిర్మాణానికి స్థలసేకరణ పెద్ద సమస్యగా మారడంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆయన తండ్రి పొదలకూరు సమితి మాజీ అధ్యక్షుడు దివంగత కాకాణి రమణారెడ్డి అప్పట్లో కృషి చేసి స్థలాన్ని సేకరించారు.

జెడ్పీచైర్మన్‌గా కాకాణి కృషి

కాకాణి జెడ్పీచైర్మన్‌గా కొనసాగిన సమయంలో గ్రామీణ క్రీడాకారుల కోసం పొదలకూరులో మినీ స్టేడియం అవసరాన్ని గుర్తించి 2010లో పొదలకూరుతో పాటు నాయుడుపేట, వింజమూరులో మినీ స్టేడియం నిర్మాణాలకు జెడ్పీ నిధుల నుంచి రూ.52 లక్షల చొప్పున మంజూరు చేశారు. పొదలకూరులోని 11 ఎకరాల్లో మినీ స్టేడియం కోసం భవనం, ప్రహరీ, క్రీడామైదానం చదును చేయడం వంటి పనులు చకచకా జరిగిపోయాయి. తర్వాత స్టేడియం పనులు నిధుల లేమి, రాజకీయ కారణాల వల్ల నిలిచిపోయాయి. ప్రహరీ కొద్దిరోజులకే నెర్రెలు ఇచ్చింది. గత ప్రభుత్వంపై ప్రతిపక్ష ఎమ్మెల్యేగా గోవర్ధన్‌రెడ్డి ఒత్తిడి పెంచినా లాభం లేకపోయింది.

రిపేర్లకు నిధుల మంజూరు

పొదలకూరు స్టేడియంను ఉపయోగంలోకి తీసుకురావాలని మంత్రి కాకాణి నిధులు కేటాయించారు. తిరుపతి ఎంపీ లాడ్స్ నుంచి రూ.10 లక్షలు, ఎంపీపీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.13 లక్షలు, ఎంపీపీ జనరల్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు కలిపి మొత్తం రూ.33 లక్షలను సమకూర్చారు. ఈ నిధులతో వేగంగా పనులు జరిగి స్టేడియం రూపురేఖలు మారిపోయాయి. క్రీడా ప్రాంగణం చదును కోసం మరో రూ.20 లక్షలు మంజూరు చేయించి పనులు పూర్తి చేశారు.

నేడు ప్రారంభం

దివంగత కాకాణి రమణారెడ్డి స్టేడియం నిర్మాణానికి స్థలసేకరణ చేయడంలో విశేష కృషి చేసినందున స్టేడియానికి ఆయన పేరును నమకరణం చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్టేడియంను ప్రారంభించనున్నారు. కాగా ఈ స్టేడియం భవనంలో స్త్రీ, పురుష క్రీడాకారులు ప్రత్యేకంగా బస చేసేందుకు గదులు, ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యం ఉంది.



కాకాణి రమణారెడ్డి స్టేడియం



చదును చేసిన స్టేడియంలోని క్రీడా ప్రాంగణం

మహిళలకు ముగ్గుల పోటీలు

పొదలకూరు : పట్టణంలోని దేవాంగవీధిలో చాముండేశ్వరీ దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొత్తం 18 మంది మహిళలు పాల్గొని రంగువల్లులను అందంగా తీర్చిదిద్దారు. వీరిని తొమ్మిది టీమ్‌లుగా విభజించి టీమ్‌కు ఇద్దరు వంతున పోటీలను ఏర్పాటు చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మదిర కృష్ణవేణి, బి.లావణ్య, పడవల రేణుక నిలిచారు. పోటీల్లో పాల్గొన్న వారికి కన్సొలేషన్ బహుతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, నేతలు వూకోటి లక్ష్మీనారాయణ, అట్లా ప్రభాకర్‌రెడ్డి, పముజుల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు అభినందన